# అయోధ్యని తలపించేలా భద్రాచలాన్ని నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లక్షలాది పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందించిందని సీఎం తెలిపారు. రైతుల కోసం ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసి సమస్యలకు పరిష్కారం చూపిన ఘనత వైఎస్సార్‌దేనని గుర్తుచేశారు. అదే తరహాలో ఇప్పుడు తమ ప్రభుత్వం పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని వివరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలపై కుట్ర పన్ని, వారికి ఇళ్లు దక్కకుండా చేసిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకే పేదలకు ఇళ్లను అందించే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం భుజాన వేసుకుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని ఆయన స్పష్టం చేశారు.భద్రాచలానికి రూ.100 కోట్ల నిధులు ఇస్తానని గతంలో కేసీఆర్ ప్రకటించినప్పటికీ ఆ హామీ అమలుకాలేదని సీఎం విమర్శించారు. అయితే తమ ప్రభుత్వ హయాంలో భద్రాచలంలో భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. భద్రాచలాన్ని భక్తులు, పర్యాటకులు ఆకర్షితులయ్యేలా, అయోధ్యను తలపించే విధంగా అద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి హామీ ఇచ్చారు.

# సంక్రాంతికి ఆర్టీసీకి కాసుల పంట

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ఈ ఏడాది సంక్రాంతి పండుగ కాసుల పంట పండించింది. పల్లె బాట పట్టిన ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడటంతో సంస్థ ఖజానా కళకళలాడుతోంది. కేవలం ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయి ఆదాయం సాధించి ఆర్టీసీ తన సత్తా చాటింది. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజుల వ్యవధిలో టికెట్ విక్రయాల ద్వారా రూ.67.40 కోట్ల ఆదాయం లభించినట్లు అధికారులు ప్రకటించారు.సగటు రోజు వారి ఆదాయం రూ.13.48 కోట్లు ఉండగా.. ప్రత్యేక సర్వీసుల ద్వారా రోజుకు అదనంగా రూ.2.70 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది సంక్రాంతికి వరుస సెలవులు (డబుల్ వీకెండ్) రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు భారీగా స్వగ్రామాలకు పయనమయ్యారు. ప్రయాణికుల రద్దీని ముందే ఊహించిన ఆర్టీసీ, సుమారు 6,431 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ వాహనాల దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, ఆర్టీసీ సురక్షిత ప్రయాణాన్ని అందించడంతో జనం కూడా ప్రభుత్వ బస్సులకే జై కొట్టారు.

**తిరుగు ప్రయాణానికి సిద్ధం..**

పండుగ ముగించుకుని తిరిగి పట్నం వస్తున్న వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇవాళ, రేపు కూడా భారీగా స్పెషల్ సర్వీసులు నడుపుతున్నారు. ప్రధాన జంక్షన్లు, బస్టాండ్ల వద్ద అధికారుల పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్ చేరుకునే ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక డ్రాపింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. నష్టాల్లో ఉన్న సంస్థకు ఈ స్థాయి ఆదాయం రావడం పెద్ద ఊరటని.. ప్రైవేట్ ట్రావెల్స్ కంటే ఆర్టీసీని నమ్మిన ప్రజలకు రవాణా అధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ముఖ్యమంత్రివా..? ముఠా నాయకుడివా..?

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలను విస్మరించి, అసాంఘిక చర్యలను ప్రోత్సహించేలా మాట్లాడటం ద్వారా సీఎం తన హోదా, స్థాయిని తానే తగ్గించుకున్నారని విమర్శించారు.తెలంగాణ ప్రజల మనసుల్లో గులాబీ జెండాకు ఉన్న ఆదరణను చూసి ముఖ్యమంత్రికి మైండ్ బ్లాక్ అయినట్లుగా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కూడా పూర్తికాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లోనే సీఎం మానసిక స్థిరత్వాన్ని కోల్పోయినట్లుగా మాట్లాడుతున్నారని, ఆయన తాజా వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెట్టినా కేసులు నమోదు చేసి అరెస్టులు చేసే పోలీస్ వ్యవస్థ, ఇప్పుడు బహిరంగంగా హింసను రెచ్చగొట్టేలా మాట్లాడిన ముఖ్యమంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర డీజీపీ వెంటనే స్పందించి, చట్టప్రకారం ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా కొనసాగుతూనే రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా మాట్లాడటం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా తన పాత బాస్ ఆదేశాల ప్రకారమే తెలంగాణ జలహక్కులను తాకట్టు పెట్టారని విమర్శించారు. తాజాగా చేసిన వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి అసలు స్వరూపం ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని అర్థం చేసుకున్న రేవంత్, ఆ నావ నుంచి బయటపడేందుకు ఇప్పటినుంచే మార్గం సిద్ధం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు.ఒకవైపు బీజేపీతో గోప్య ఒప్పందాలు చేసుకుంటూ, మరోవైపు టీడీపీని తెలంగాణపై రుద్దే ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని కేటీఆర్ హెచ్చరించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగ నియామకాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన స్పష్టంగా అన్నారు.

# మేడారం మహాజాతరకు సర్వం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తున్నారు. జాతర నిర్వహణను క్రమబద్ధీకరించేందుకు మొత్తం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టార్లుగా విభజించారు. 42,027 మంది అధికారులు, సిబ్బందితో పాటు 2,000 మంది ఆదివాసీ యువ వాలంటీర్లు సేవలందించనున్నారు. నెట్‌వర్క్ అంతరాయం లేకుండా 27 శాశ్వత, 33 తాత్కాలిక టవర్లు, 450 విహెచ్ఎఫ్ సెట్లను ఏర్పాటు చేశారు.

**ట్రాఫిక్ కష్టాలకు చెక్...**

భక్తుల రాకపోకల కోసం టీజీఆర్టీసీ భారీ ఆపరేషన్ చేపట్టింది. 4,000 బస్సుల ద్వారా 51,000 ట్రిప్పులు నడపనుంది. ఇందులో 10,441 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేశారు.

**పారిశుధ్యం, ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత..**

కోట్లాది మంది భక్తులు వచ్చే చోట పరిశుభ్రతకు పెద్దపీట వేశారు. 285 బ్లాకుల్లో 5,700 టాయిలెట్లు, అదనంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.5,000 మంది పారిశుధ్య కార్మికులు నిరంతరం పనిచేయనున్నారు. 5,192 మంది వైద్య సిబ్బంది, 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు అందుబాటులో ఉండనున్నాయి. దీంతో పాటు 50 పడకల ప్రధాన ఆసుపత్రితో పాటు రోజూ 30 మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. 5,482 నల్లాలు, మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 28 డీజిల్ జనరేటర్లు (బ్యాకప్), 210 మంది గజ ఈతగాళ్లు, 100 SDRF బృందాలు, 15 వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు, జంపన్నవాగు వద్ద 119 గదుల సౌకర్యం కల్పించనున్నారు.

**మీడియా కోసం ప్రత్యేక ఏర్పాట్లు..**

దేశ విదేశాలకు జాతర విశేషాలను చేరవేసేందుకు అమ్మవార్ల గద్దెల పక్కనే ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో హైటెక్ మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. 100 Mbps ఇంటర్నెట్, 20 హైకన్ఫిగరేషన్ కంప్యూటర్లు, జిరాక్స్, ఫ్యాక్స్ సదుపాయాలతో పాటు జర్నలిస్టులకు భోజన వసతి కల్పిస్తున్నారు.



# అఫ్జల్‌గురును హీరోగా చిత్రీకరించడం దారుణం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :**



భారత రాజకీయాల్లో మేధావులు, విద్యావంతులు ముందుకు రావాల్సిన అవసరం ఎంతో ఉందని, గతంలో రాజకీయాలు అంటే కేవలం డబ్బు ఉన్న వారో, అంగబలం, క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారో మాత్రమే వస్తారని భావించేవారని ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. నేటి యువత నెక్స్ట్ జనరేషన్, జన్జ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వానికి, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రముఖ డాక్టర్ సాయిచంద్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడగల నాయకుడు, దేశ సమస్యలను పరిష్కరించగల పార్టీ, దేశ ద్రోహ శక్తులు ఎందుకు పెరుగుతున్నాయి.. వాటిని ఎలా ఎదుర్కోవాలనే ప్రశ్నలపై యువతలో స్పష్టమైన ఆలోచన పెరిగిందన్నారు.

**అఫ్జల్‌గురును హీరోగా చిత్రీకరించడం దారుణం..**

ఇటీవల కొన్ని విశ్వవిద్యాలయాల్లో అఫ్జల్‌గురును హీరోగా చిత్రీకరించడం, దేశ న్యాయవ్యవస్థను అవమానించడం, జేఎన్‌యూ వంటి సంస్థల్లో కొంతమంది ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అవహేళనకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్‌పై ద్వేషపూరితంగా మాట్లాడటం, దేశవిరోధ నినాదాలు వినిపించడం వంటి పరిణామాలను దేశం చూసిందన్నారు. దేశ విరోధి శక్తులను ఎదుర్కోవాలంటే దేశాన్ని ప్రేమించే, సమాజం పట్ల బాధ్యత కలిగిన చదువుకున్న వారు కూడా ఒక సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఉంది.. ఇటీవలి కాలంలో యువ నాయకులు, విద్యావంతులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పార్టీలో చేరుతూ దేశసేవలో భాగస్వాములు అవుతున్నారు. బీహార్‌లో అతి తక్కువ వయసులో ఎమ్మెల్యేగా గెలిచిన యువ నాయకులు కూడా బీజేపీలో చేరడం రాజకీయాల్లోకి వస్తున్న నూతన తరానికి స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న రెండు ప్రధాన పార్టీలు ప్రజలకు విధానాలు చూపించలేక, బూతుల రాజకీయాలతోనే కాలం గడుపుతున్నాయి. ఒకరు ప్యాంట్ విప్పుతా అంటారు, మరొకరు తోలు తీస్తా అంటారు. ఈ రకమైన భాష, ఈ రకమైన రాజకీయాలు రాబోయే తరానికి తీవ్రంగా ప్రమాదకరంగా ఉందన్నారు.

**మజ్లిస్ పార్టీని రాజకీయంగా అడ్డుకోవాలి..**

దేశాన్ని శక్తివంతంగా చేయాలంటే, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే, భారత్‌ను ఒక జాతీయ శక్తిగా నిలబెట్టాలంటే మేధావులు తమ పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉంది. డాక్టర్లు, ఫిజియోథెరపిస్ట్‌లు, పారామెడికల్ రంగంలో పనిచేస్తున్న వారు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరడం ఎంతో శుభపరిణామంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అందరి సహకారంతో హైదరాబాద్‌లో బీజేపీ మేయర్‌ను గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉంది. మజ్లిస్ పార్టీని రాజకీయంగా అడ్డుకోవాల్సిన మరింత ఉందన్నారు. దేశం ఎదుర్కొంటున్న ప్రమాదం మజ్లిస్ కేవలం తెలంగాణ, హైదరాబాద్‌కో మాత్రమే పరిమితం కాదు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి తప్పకుండా మారుతుంది. కర్ణాటకలో కూడా బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుంది.. దేశం మొత్తం క్రమంగా కాషాయం వైపు సాగుతోందన్నారు. ఈ మార్పునకు నాంది పలకాల్సింది మేధావులేనని, తెలంగాణ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, రంగా రెడ్డి (పట్టణ) జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి, మేడ్చల్ (పట్టణ) జిల్లా కన్వీనర్ డాక్టర్ మల్లారెడ్డి, మాధవరం కాంతారావు, డా. రాజశేఖర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కజిరంగా ఒక నేషనల్ పార్క్ మాత్రమే కాదు.. అస్సాం ఆత్మ

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పర్యావరణ పరిరక్షణ, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అస్సాంలో భారీ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. నాగావ్ జిల్లాలోని కలియాబోర్ వేదికగా సుమారు రూ.6,950 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కజిరంగా ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ నేడు శంకుస్థాపన చేశారు. ఈ జాతీయ రహదారి ప్రాజెక్టు మొత్తం పొడవు 86 కిలోమీటర్లు ఉండనుంది. ఇందులో 35 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ వైల్డ్‌లైఫ్ కారిడార్ ఉంటుంది. ఇది కజిరంగా నేషనల్ పార్క్ మీదుగా సాగుతుంది. ఈ ప్రాజెక్టు నాగావ్, కర్బీ ఆంగ్లాంగ్, గోలాఘాట్ జిల్లాల గుండా వెళుతూ.. ఎగువ అస్సాంలోని డిబ్రూగఢ్, తిన్సుకియా ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది. ఎలివేటెడ్ కారిడార్ వల్ల వన్యప్రాణుల సంచారానికి ఆటంకం కలగదు, తద్వారా మానవవన్యప్రాణి సంఘర్షణలు తగ్గుతాయి.ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. కజిరంగా కేవలం ఒక నేషనల్ పార్క్ మాత్రమే కాదని, అది అస్సాం ఆత్మ అని కొనియాడారు. యునెస్కో గుర్తించిన ఈ ప్రపంచ వారసత్వ సంపదను కాపాడటం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో దేశంలో అటవీ విస్తీర్ణం పెరిగిందన్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారం కింద ఇప్పటివరకు రూ.260 కోట్ల మొక్కలు నాటారని ఆయన తెలిపారు. ప్రకృతి, అభివృద్ధి కలిసి సాగగలవని భారత్ ప్రపంచానికి చాటిచెబుతోందని అన్నారు. అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం అక్రమ చొరబాటును అడ్డుకోవడంలో, అడవులను, సాంస్కృతిక ప్రదేశాలను ఆక్రమణల నుండి విడిపించడంలో చేస్తున్న కృషిని ప్రధాని అభినందించారు. దేశ ప్రజ



లందరికీ బీజేపీ మొదటి ప్రాధాన్యతగా మారిందని, ఇటీవలి బీహార్ ఎన్నికలు, మహారాష్ట్రలోని బిఎంసి ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ప్రధాని మోడీ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో అస్సాం అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు.ఈ పర్యటనలో భాగంగా ప్రధాని రెండు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించారు. కామాఖ్య రోహ్‌తక్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, డిబ్రూగఢ్ లక్నో (గోమ్తీ నగర్) అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూనే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా అస్సాం భవిష్యత్ తరాలకు గొప్ప అవకాశాలను కల్పిస్తామని ప్రధాని భరోసా ఇచ్చారు.

# ముంబై పోలీసులకు 'మెగా' కానుక..



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మహారాష్ట్ర ప్రభుత్వం ముంబై పోలీసుల సంక్షేమం దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. నగరంలో శాంతిభద్రతలను కాపాడే పోలీసు యంత్రాంగానికి మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఏకంగా 45,000 ప్రభుత్వ క్వార్టర్లను నిర్మించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ భారీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. మహారాష్ట్ర స్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లో భాగంగా 5 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.20,000 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. 30 శాతం నిధులు ప్రభుత్వం కేటాయించగా, మిగిలిన 70 శాతం వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణం ద్వారా సమీకరించనున్నారు. పోలీసుల సంక్షేమమే మా ప్రాధాన్యత అని.. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది పోలీసు కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుతుందని, సాంకేతిక పరిశీలన కోసం ఇప్పటికే రూ.100 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**పోలీసుల అవసరాలే ప్రాతిపదికగా..**

ముంబైలో ప్రస్తుతం 51,308 మంది పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, కేవలం 22,904 సర్వీస్ హౌజ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇందులో కూడా సుమారు 3,777 క్వార్టర్లు శిథిలావస్థకు చేరి నివాసానికి యోగ్యం కాకుండా పోయాయి. పెరుగుతున్న జనాభా, నగర అవసరాల దృష్ట్యా పోలీసులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నివాసాలు అత్యవసరమని ప్రభుత్వం గుర్తించింది.

**ఆధునిక హంగులతో నిర్మాణాలు..**

పాత పోలీస్ కాలనీలను పునరుద్ధరించడంతో పాటు, సరికొత్త సాంకేతికతతో ఈ 45 వేల ఇండ్లను నిర్మించనున్నారు. ఇందుకోసం అత్యాధునిక ఇంజనీరింగ్ పద్ధతులను అనుసరించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఈ మెగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ముంబై పోలీసుల గృహ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

# బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం కూడా కొనసాగింది. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సున్నం చంద్రయ్య (అలియాస్ పాపారావు), నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఈ ప్రాంతంలో ఉన్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ భారీ కూంబింగ్ చేపట్టారు. శనివారం జరిగిన కాల్పుల్లో దిలీప్ బెడ్జాతో సహా నలుగురు మావోయిస్టులు మరణించగా, ఆదివారం జరిగిన కాల్పుల్లో మరో ఇద్దరు చనిపోయారు.

**మృతుల్లో మహిళా మావోయిస్టు..**

ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా.. అందులో ఒక మహిళా మావోయిస్టు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిల్స్, భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా దళాలు ఉమ్మడిగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని, అటవీ ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మావోయిస్టుల కదలికలపై నిఘా ఉంచామని.. ప్రస్తుతం అటవీ ప్రాంతం తమ ఆధీనంలో ఉందని ఆయన వెల్లడించారు.

# ఆస్తులు సంపాదించేందుకు రాజకీయాల్లోకి రాలేదు

(మొదటి పేజీ తరువాయి)



ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క ఈ అంశంపై విస్తృతంగా మాట్లాడారు.తాను రాజకీయాల్లోకి వచ్చినది ఆస్తులు కూడబెట్టుకోవడానికో, వ్యాపార ప్రయోజనాలు పొందడానికో కాదని ఆయన స్పష్టంచేశారు. ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులు ప్రజలందరికీ సమానంగా అందేలా చూడటమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులను కాపాడుతూ, వాటిని పారదర్శకంగా వినియోగించడమే తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు.నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరగాలని సింగరేణి సంస్థకు సూచనలు ఇచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థే తప్ప, మంత్రి లేదా ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. బొగ్గు గనులు ఉన్న ప్రాంతం భౌగోళికంగా క్లిష్టమైనది కావడంతో, టెండర్లలో ఫీల్డ్ విజిట్ నిబంధనను తప్పనిసరి చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఈ విధమైన నిబంధనలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థల్లో కూడా అమల్లో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు.సింగరేణి సంస్థ ప్రజల ఆస్తి అని, బొగ్గు గనులు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి చెందిన వనరులను గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి రక్షించడమే తన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. మీడియా సంస్థల మధ్య ఉన్న అంతర్గత విషయాలు లేదా వ్యాపార ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధుల పేర్లు అనవసరంగా లాగొద్దని ఆయన హెచ్చరించారు.వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా కథనాలు రాయడానికి ఎవరికీ హక్కు లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సంబంధం లేకుండా తన పేరును ఆ కథనంలో ప్రస్తావించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పత్రికలో వచ్చిన వార్త వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశం పూర్తిగా అర్థమైన తర్వాత, అన్ని వివరాలను ప్రజల ముందుంచుతానని తెలిపారు.అలాగే, వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ఉన్న వ్యతిరేకతను ఆయనకు సన్నిహితుడైన తనపై చూపిస్తున్నారని భట్టి విక్రమార్క ఆరోపించారు. నాయకుల మధ్య విభేదాలు సృష్టించాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అయితే, ఇలాంటి అసత్య ప్రచారాలకు భయపడి తాను ఎప్పటికీ లొంగిపోయే వ్యక్తిని కాదని భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు.

# రిజర్వేషన్లకు బాటలు వేసిన నాయకుడు ఎన్టీఆర్..

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఒకప్పుడు తెలుగువారిని "మదరాసి" అంటూ అవమానించిన పరిస్థితుల్లో, ప్రత్యేకమైన తెలుగు జాతి ఉందని దేశానికి గుర్తు చేసిన నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు ప్రసంగించారు.

**రిజర్వేషన్లకు బాటలు వేసిన నాయకుడు ఎన్టీఆర్..**

బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం



రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని సీఎం గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో సగం వాటా హక్కు కల్పించి, సమానత్వానికి బలమైన పునాది వేశారని తెలిపారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందు పెద్దగా చదువు లేని వ్యక్తులే ఎక్కువగా రాజకీయాల్లో ఉండేవారని, అయితే చదువుకున్న వారికి అవకాశాలు ఇవ్వాలని ఎన్టీఆర్ నమ్మారని చెప్పారు. టీడీపీలో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది కూడా ఎన్టీఆరేనని చంద్రబాబు వెల్లడించారు. ఎన్టీఆర్ వచ్చిన తర్వాతే కృష్ణా మిగులు జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కూ హక్కు ఉందనే విషయం స్పష్టమైందన్నారు. రాయలసీమకు తగినంత నీళ్లు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు.

**త్వరలో 700 అన్నక్యాంటీన్లు:**

రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 700 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఉగాది పండుగ రోజున మరో 5 లక్షల గృహ ప్రవేశాలు జరగనున్నాయని చెప్పారు. ఆర్థికంగా సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన భూములపై గత పాలకులు తమ ఫొటోలు పెట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టించారని చంద్రబాబు విమర్శించారు. తాను వెళ్లిన ప్రతి ప్రాంతంలోనూ 80 శాతం ఫిర్యాదులు భూముల సమస్యలపైనే వస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.700 కోట్లు ఖర్చు చేసి సర్వే రాళ్లపై తమ ఫొటోలు వేయించుకున్నారని ఆరోపించారు.ఉద్యోగుల బకాయిలు చెల్లించి వారికి నిజమైన సంక్రాంతి కానుక అందించామని చంద్రబాబు తెలిపారు. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి రావడం గర్వకారణమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి పూర్తిగా సహకరిస్తూ, దేశ అభివృద్ధిలో రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందని సీఎం స్పష్టం చేశారు.